క్లుప్తంగా

ఏటూరునాగారం తహసీల్దార్‌గా సంధ్యారాణి



ఏటూరునాగారం : స్థానిక తహసీల్దార్‌గా సంధ్యారాణిని నియమిస్తూ జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నర్సంపేటలో డీటీగా పనిచేస్తున్న ఆమె ఎన్నికల బదిలీల నేపథ్యంలో పదోన్నతి కల్పిస్తూ ఇక్కడికి తహసీల్దార్‌గా నియమించారు. శుక్రవారం విధుల్లో చేరిన సంధ్యారాణిని ఆర్ఐ శ్రీనివాస్, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఇక్కడి పనిచేసిన వీరస్వామి మంగపేటకు బదిలీ అయ్యారు.

పోలింగ్ స్టేషన్ పరిశీలన

స్థానిక జెడ్పీహెచ్ఎస్ ఆవరణలోని పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ సంధ్యారాణి పరిశీలించారు.ఆమె వెంట ఆర్ఐ శ్రీనివాస్ ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



మంగపేట: తహసీల్దార్‌గా బైరి వీరస్వామి బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఏఆర్ఐ ఏసుపాదం, జూనియర్ అసిస్టెంట్ తళ్ళపెల్లి నందకిశోర్, సర్వేయర్ సఫీయాబేగం , కార్యాలయ సిబ్బంది పూల బోకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తమ టీచర్‌కు సన్మానం



ఎస్ఎస్‌తాడ్వాయి: స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయురాలు నాగమణిని పాఠశాల ఉపాధ్యాయుల బృందం శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు.పాఠశాల నుంచి ఉత్తమ ప్రశంసపత్రం అందుకున్న నాగమణిని హెచ్ఎం పద్మ, పలువురు అభినందించారు.

భవనాలు మంజూరు చేయాలి



వెంకటాపురం(ఎం): మండలంలోని వెంకటాపురం, నల్లగుంట, పాలంపేట, రామాంజాపూర్ గ్రామాల్లో గ్రామ సమాఖ్య భవనాలు నిర్మించాలని కోరుతూ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతికి శుక్రవారం మండల కేంద్రంలో ఆయా గ్రామాలకు చెందిన వీఓఏలు వినతిపత్రం అందించారు. మంత్రి సత్యవతిరాథోడ్ దృష్టికి తీసుకువెళ్లి భవనాల నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేసేవిధంగా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీఓఏలు శెట్టి మంజుల, తైనవేని సరోజన, సాద రాజప్రమీల, రమ, సరళ, రెడ్డి వనమాల, అరుణ, జ్యోతి, హరిస్సాబేగం, రోష పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తులపై ఇంటింటి సర్వే



వెంకటాపురం (కె) : స్థానిక మేజర్ పంచాయతీలో శుక్రవారం గృహలక్ష్మి దరఖాస్తులపై పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాలయం వీధి, ఎస్సీ మర్రిగూడెం వీధుల్లో సర్వే చేపట్టారు. దరఖాస్తుదారులు సొంత స్థలం ఉన్నది లేనిది, ప్రస్తుతం ఎక్కడ నివాసం ఉంటున్నారు అనే తదిత అంశాలపై సర్వే నిర్వహించారు.

'గిరిజన మహిళపై దాడి బాధాకరం'

ములుగు: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నడిబొడ్డున గిరిజన మహిళపై పోలీసులు అకారణంగా చేయిచేసుకొని చిత్రహింసలకు గురిచేయడం అవమానీయం అని కాంగ్రెస్ పార్టీ ములుగు పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి శుక్రవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన మహిళను అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా లాఠీలు, బూటు కాళ్లతో దాడి చేయడం సర్వసభ్య సమాజం తలదించుకునేలా ఉందని అన్నారు.దాడికి పాల్పడిన పోలీసులను సర్వీస్ నుంచి రిమూవ్ చేయాలని డిమాండ్ చేశారు.

సమన్వయంతో పనిచేయాలి

- పనుల్లో నిర్లక్ష్యం వద్దు
- అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి
- ములుగు మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

ములుగు: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్‌యాదవ్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ శాఖ అధికారులకు సూచించారు. గ్రామాల మధ్య అంతర్గ రోడ్లను పూర్తి చేసి రవాణా వ్యవస్థకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించడంతో పాటు తగిన చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. అన్ని గ్రామాలకు సురక్షిత నీరు సరఫరా అయ్యేలా మిషన్ భగీరథ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులు, గర్భిణీలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీలు, సూపర్‌వైజర్లకు సూచించారు. అర్హులైన కులవృత్తిదారులకు రూ. లక్ష రుణం అందించేలా చూడాలని, దళిత బంధు, గృహ లక్ష్మీ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. ఆయా శాఖల తరఫున అధికారులు అందించిన నివేదికలను పరిశీలించారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు పూర్తి స్థాయిలో హాజరుకాకపోవడం విశేషం. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి : బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క శుక్రవారం అన్నారు. మండలంలోని బీరెల్లి, నర్సాపూర్ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన జాజ సమ్మక్క, ఈసం సమ్మక్కల బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే సీతక్క పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన అంకంపల్లి సర్పంచ్ సావిత్రి, బాలరాజులను పరామర్శించారు. నర్సాపూర్ గ్రామానికి చెందిన నాలి పుల్లమ్మ, జవ్వాజి రాజులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అపెండిక్స్ ఆపరేషన్ చేయించుకున్న కాటాపూర్‌కు చెందిన పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇందరావు లాలయ్యను పరామర్శించారు. ఆమె వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ ముజఫర్, సర్పంచ్‌లు ఇర్ప సునీల్ దొర, ఇర్ప అశ్విని సూర్యం, మంకిడి నర్సింహస్వామి, ఎంపీటీసీ జయమ్మ ఆనందం, జిల్లా నాయకుడు అరెం లచ్చుపటేల్, యూత్ మండల అధ్యక్షుడు కోడి సతీష్, తదితరులు ఉన్నారు.



ఎస్ఎస్ తాడ్వాయి: బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీతక్క

పరామర్శ

ములుగు రూరల్: మండలంలోని జీవింతరావుపల్లికి చెందిన‌ఓ రిపోర్టర్ శరత్ తండ్రి సమ్మయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ములుగు ఎమ్మెల్యే సీతక్క పరామర్శించారు. శుక్రవారం సమ్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్ అధ్యక్షుడు బానోత్ రవిచందర్, నల్లెల్ల భరత్, దేవ్‌సింగ్, సర్పంచ్ రత్నం భద్రయ్య, వంశీక్రిష్ణ ఉన్నారు.

ఘనంగా మేరా మిట్టి మేరా దేశ్



సామ్రాజ్యాన్ని సన్మానిస్తున్న అధికారులు

మంగపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా అమరజవాన్లు దేశంకోసం ప్రాణత్యాగం చేసిన పౌరులను గౌరవించుకోవడానికి చేపట్టిన మేరా మిట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని ఎంపీడీఓ శ్రీధర్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులు, ప్రాణాలు అర్పించిన అనేకమంది నాయకుల త్యాగ ఫలితాలను నేడు మనందరం అనుభవిస్తున్నామన్నారు. వారి జ్ఞాపకార్థంగా 75 మొక్కలతో ప్లాంటేషన్ ఏర్పాటు చేసేందుకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం భూమికి వందనం చేసి ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ సేవకురాలు, కస్తూర్బా మహిళా అధ్యక్షురాలు, వృద్ధాశ్రమం నిర్వాహకురాలు కొమరగిరి సామ్రాజ్యాన్ని అధికారులు శాలువాతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి స్వప్నిత, ఎంపీఓ శ్రీనివాస్, ఉపాధిహామీ(ఈజీఎస్) ఏపీఓ చరణ్‌రాజ్, ఇంజనీర్ కన్సల్టెంట్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మాలోతు హీరూ, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాంపురంలో కమ్యూనిటీ కాంట్రాక్టు ప్రోగ్రాం



వెంకటాపురం(కె): అసాంఘిక శక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అశోక్ అన్నారు. శుక్రవారం సీతారాంపురం గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో సమావేశం నిర్వహించి గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 14 ఏళ్ల లోపు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని సూచించారు. గ్రామంలోకి కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చినట్లయితే వారి సమాచారాన్ని పోలీసులకు అందించాలని అన్నారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలే తప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రజలు అలర్ట్‌గా ఉండాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: రానున్న 24 గంటల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని మండలంలోని ప్రజలు అలర్ట్‌గా ఉండాలని స్థానిక ఎస్సై ఓంకార్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మేడారం జంపన్నవాగు లోతట్టు ప్రాంతాల్లోని గోనెపల్లి, ఎల్బాక, పడిగాపూర్, ఊరట్ట, మేడారం, రెడ్డిగూడెం, కన్నెపల్లి, కాల్వపల్లి గ్రామాల్లోని ప్రజలు, మేడారంలోని చిరువ్యాపారులు అప్రమత్తంగా ఉండడంతోపాటు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే మారుమూల అటవీ ప్రాంతంలోని బంధాల, పోశాపూర్, అల్లిగూడెం గ్రామాల్లోని ప్రజలు కూడా జాగ్రతగా ఉండాలన్నారు. వర్షాల కారణంగా ఇబ్బందులు కలిగితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రోడ్లు ధ్వంసమై రవాణాకు అంతరాయం కలిగితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఉధృతంగా ప్రవహించే వాగులు, వంకలు దాటే ప్రయత్నాలు చేయొద్దన్నారు.

పంచాయతీ కార్యదర్శి తొలగింపు

మంగపేట: మండలంలోని అకినేపల్లిమల్లారంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రవికుమార్‌ను ములుగు జిల్లా అమ్మ సోషల్ సర్వీసెస్ ఉద్యోగ సర్వీస్ నుంచి తొలగించినట్లు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జూలై 13న అప్పటి జిల్లా అదనపు కలెక్టర్, ప్రస్తుత జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి జీపీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పంచాయతీ నిర్వహణ రికార్డులను చూపించమని పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌ను ప్రశ్నించగా కొన్ని రికార్డులు తన ఇంటి వద్ద ఉన్నాయని, మరికొన్ని రికార్డులు కార్యాలయంలోని బీరువాలో ఉన్నాయన్నాయని చెప్పాడు. బీరువా తాళాలు పంచాయతీ సిబ్బంది వద్ద ఉన్నాయని సిబ్బంది సమ్మెలో ఉన్నారని చెప్పడంతో కార్యదర్శిపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి నుంచి ఆయనను విధుల నుంచి తాత్కాలికంగా పక్కన పెట్టి నర్సాయిగూడెం కార్యదర్శి శ్రావణ్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రవికుమార్ చట్టబద్ధంగా విధులు నిర్వహించడంలో విఫలం కావడంతో పాటు రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించగా ఈనెల 5 నుంచి ఉద్యోగ సర్వీస్ నుంచి తొలగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరికీ పట్టాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): పోడు భూముల సర్వే చేసి రైతులలందరికీ పట్టాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సృజన్ కుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా పోడు సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు పట్టాలివ్వాలని అన్నారు. కేంద్రం ఆమోదించిన అటవీ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కారం పుల్లయ్య, రాములు, వాసు, రాంబాబు, శ్రీలత, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కన్నాయిగూడెం: వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



వెంకటాపురం(కె)లో...



వాజేడులో..

కన్నాయిగూడెం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కన్నాయిగూడెం వైద్యాధికారి గిరి అన్నారు. శుక్రవారం కన్నాయిగూడెంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. శిబిరంలో వైద్యసిబ్బంది పుష్ప, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి గ్నానస అన్నారు. మండల పరిధిలోని మొరుమూరు కాలనీ, ప్రగళ్లపల్లి గ్రామాల్లో శుక్రవారం వైద్య శిబిరాలను నిర్వహించారు.రెండు గ్రామాల్లో ఉన్న రోగులను పరీక్షించి మందులను ఇచ్చారు. ఇందులో భాగంగా పలువురి నుంచి రక్త పూతలను సేకరించారు. గర్భిణీలు, మధుమేహం వ్యాధిగ్రస్తులను, బాలింతలను, బీపీ ఉన్న వారికి పరీక్షలను చేసి మందులను అందించారు. కార్యక్రమంలో కోటిరెడ్డి, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండల పరిధిలోని సీతారాంపురంలో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామంలో జ్వరపీడితులపై ఇంటింటి సర్వే నిర్వహించారు. మురికినీటి గుంటల్లో నిలువ ఉన్న నీటిని తొలగించాలని మురుగునీరు ని ల్వ ఉండటంపై దోమలు వ్యాప్తి చెందుతాయని వివరించారు. కార్యక్రమలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి



నినాదాలు చేస్తున్న గౌడ సంఘం నాయకులు

ఏటూరునాగారం: స్థానిక వై జంక్షన్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను గౌడ సంఘం నాయకులు, కులస్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి నరేందర్ గౌడ్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సామాజిక ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గడ్డం మహేశ్వర్, మాజీ అధ్యక్షులు గడ్డం రాజమౌళి, సప్పిడి రాంనర్సయ్య, గడ్డం సదానందం, చంద్రమౌళి, సప్పిడి రాము, బొనగాని సదానందం, రాజయ్య, గడ్డం సంతోష్, కూనూరు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో లోపించిన పారిశుద్ధ్యం

- విజృంభిస్తున్న దోమలు
- ఫాగింగ్ మరిచిన అధికారులు



ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు గదిలో నిరుపయోగంగా ఉన్న ఫాగింగ్ మిషన్లు

మంగపేట: గ్రామాల్లో పారిశుద్ధ్యం కారణంగా దోమలు రోజు రోజుకు వృద్ధి చెందుతూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అయినప్పటికీ గ్రామ పంచాయతీ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా గ్రామాల్లో ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. జూలై 31న మండల ప్రత్యేకాధికారి మండలంలోని 25 గ్రామ పంచాయతీల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతి నెలా 01, 11, 21 తేదీల్లో తాగునీరు సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరిచి వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ప్రతి రోజు ఓహెచ్ఆర్ ట్యాంకులు, సిస్టర్న్‌లలో ద్రవ క్లోరిన్ లేదా ప్రతి 1000 లీటర్లకు 40 గ్రాముల బ్లీచింగ్ పౌడర్‌ను కలిపిన అరగంట తరువాత నీటిని విడుదల చేయాలని తాగునీటి క్లోరినేషన్ నిర్వహణ పూర్తి వివరాలను రోజువారీగా ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. మండలంలో ప్రతి గ్రామ పంచాయతీకి రూ.50 వేల వరకు ఖర్చుచేసి కొనుగోలు చేసిన ఫాగింగ్ మిషన్లు ఏమయ్యాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకుని ప్రజలు కోరుతున్నారు.

సదస్సుకు తరలిరావాలి

ఎస్ఎస్‌తాడ్వాయి : తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర ఫోరం కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఈనెల 20న నిర్వహించనున్న ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సుకు ఉద్యమకారులు తరలిరావాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు ద్యాగల సలేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సదస్సుకు మండలంలోని ఉద్యమకారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పత్తి గోపాల్‌రెడ్డి, మండల సలహాదారుడు ఆలేటి మహిపాల్‌రెడ్డి, మండల గౌరవ అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు రజినీకర్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వాజేడు: వెంకటాపురం(కె) మండలంలోని 132 కేవీ సబ్‌స్టేషన్ వద్ద మరమ్మతులు జరుగుతున్నందున శనివారం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ అర్షద్ అహ్మద్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

రెండో ఏఎన్ఎంల సమస్యలు పట్టవా?

- మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదానాయక్



సమ్మెలో పాల్గొన్న యాదానాయక్, ఏఎన్ఎంలు

ములుగు: రెండో ఏఎన్ఎంల సమస్యలు ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదానాయక్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం సమీపంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె శుక్రవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వైద్యశాఖలో గత 20 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న రెండో ఏఎన్ఎంలపై ప్రభుత్వం సవతి తల్లిప్రేమను చూపిస్తుందన్నారు. సమ్మెకు ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గెండెబోయిన రవిగౌడ్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండో ఏఎన్ఎంలు మంజూల, జమునారాణీ, తిరుమల, ఉష, భాగ్య, సీత, లలిత, నర్సమ్మ, రమ, సమ్మమ్మ, సులోచన, శ్రీలత, సారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఆగస్టు-2023 సెషన్ కొరకు ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్స్‌లో మూడోదశ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. అభ్యర్థులు పదోతరగతి సర్టిఫికెట్ ప్రకారం ఆన్‌లైన్ దరఖాస్తులో వివరాలు నమోదు చేయాలని, సెల్ఫీ ఫొటోలు అప్‌లోడ్ చేస్తే దరఖాస్తు తిరస్కరించబడుతుందన్నారు.

ఆర్థికసాయం అందజేత

కన్నాయిగూడెం: మండల పరిధిలోని ముప్పనపల్లి గ్రామానికి చెందిన బత్తుల లక్ష్మీనారాయణ వైద్య ఖర్చులకు ముప్పనపల్లి సహాయనిధి టీం ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం హనుమకొండలోని విశ్వాష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీనారాయణను పరామర్శించారు. అనంతరం రూ.15వేల ఆర్థికసాయం అందజేశారు. టీం సభ్యులు విజయ్, సతీష్, ఫైజుద్దీన్ ఉన్నారు.

మణిపూర్ ఘటన కారకులను శిక్షించాలి



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్ల సంఘం నాయకులు

ములుగు రూరల్ : మణిపూర్‌లో గిరిజన మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన కారులకు వెంటనే శిక్షించాలని పాస్టర్‌ల సంఘం అధ్యక్షుడు అబ్రహం అన్నారు. శుక్రవారం గోవిందరావుపేట మండలకేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి సీపీఎం పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, డివైఎఫ్ఐ, మహిళ సంఘం(ఐద్వా) ల నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు పాదిళ్ల చిట్టిబాబు, , తీగల ఆదిరెడ్డి , మురళి, ఉపేంద్రాచారి, రాజు, రజిత, కవిత, అరుణ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిగా రమాదేవి



రమాదేవికి స్వీటును తినిపిస్తున్న సర్పంచ్ రామ్మూర్తి

ఏటూరునాగారం: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీకి చిన్నబోయినపల్లి కార్యదర్శిగా పనిచేస్తున్న రమాదేవిని ఏటూరునాగారానికి బదిలీ చేశారు. శుక్రవారం ఆమె విధుల్లో చేరగా సర్పంచ్ ఈసం రామ్మూర్తి, సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఇక్కడ పనిచేస్తున్న అశోక్‌ను వెంకటాపురం(కె) బర్లగూడేనికి బదిలీ చేశారు. కలిసిన వారిలో బిల్ కలెక్టర్ రవీందర్, వెంకన్న, దయాకర్, లక్ష్మినారాయణ, కుమార్, జ్యోతి ఉన్నారు.